సాక్షి
చిత్తూరు
గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



టెండర్లతో భారీ ఆదాయం

కాణిపాకంలో నిర్వహించిన పలు టెండర్ల ద్వారా దేవస్థానానికి రూ.84 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. - 8లో



ప్రతిపక్షాలకు అభివృద్ధి కనిపించదు

రాష్ట్రంలో ఇంత అభివృద్ధి జరుగుతున్నా పచ్చనేతలకు, పచ్చ మీడియాకు కనిపించదని మంత్రి రోజా అన్నారు. - 8లో



వేడుకగా అక్షరాభ్యాసం

కాణిపాకం వరసిద్ధి వినాయకుడి ఆలయంలో వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

రూ.1.72 కోట్ల ఈపీఎఫ్ డీడీల అందజేత



బ్యాంకు అధికారులు పంపిన డీడీలు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న దాదాపు 310 మంది ఉద్యోగులకు సంబంధించిన గ్రూప్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) నగదు ఎట్టకేలకు ఇచ్చేశారు. 2013 నుంచి 2022 సంవత్సరం వరకు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాల్లో రికవరీ చేసిన భవిష్యనిధి సొమ్మును వారి ఖాతాల్లో జమ చేయకుండా ఉండడంపై 'సాక్షి' దినపత్రికలో ఈనెల 7వ తేదీన 'బదిలీకాని భవిష్యనిధి' శీర్షిక వార్త ప్రచురితమైంది. దీనిపై కమిషనర్ అరుణ స్పందిస్తూ యాక్సిస్ బ్యాంకు యాజమాన్యంపై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి ఉపక్రమించారు. తీరా దిగొచ్చిన బ్యాంకు నిర్వాహకులు ఉద్యోగులకు చెందాల్సిన రూ.1.72 కోట్ల నగదును డీడీల రూపంలో వెనక్కు ఇచ్చేశారు.ఇందులో రూ.1.40 కోట్లను ఉద్యోగుల పేరిట కొత్తగా ఓపెన్ చేసిన బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని, మిగిలిన రూ.33 లక్షలను చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు, పదవీ విరమణ పొంది ఉద్యోగులకు అందజేస్తామని కమిషనర్ తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరుద్యోగులు ఈ నెల 20న నిర్వహించే ప్రాంతీయ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌కు విచ్చేసిన ఆయన బుధవారం జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ నెల 20వ తేదీన చిత్తూరుకు సమీపంలో ఉన్న ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాలో 100కు పైగా కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. టెన్త్, ఆపై చదువులు చదివిన వారు మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ భరత్, రీజనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్‌మోహన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఆర్ సిబ్బంది పాత్ర కీలకం



ఏఆర్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ జాషువా

చిత్తూరు అర్బన్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) అధికారులు, సిబ్బంది పాత్ర కీలకమని చిత్తూరు ఎస్పీ పి.జాషువా అన్నారు. బుధవారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో ఏఆర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఏఆర్, హోంగార్డుల సమస్యలు తెలుసుకోవడానికి త్వరలోనే దర్బార్ పెరేడ్ ఏర్పాటు చేస్తామన్నారు. సిబ్బంది సంక్షేమం కోసం తాను ఎప్పుడూ ముందుంటానన్నారు. ఎన్నికల వేళ సాయుధ బలగాల కృషి తప్పనిసరి అన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు ఆరీఫుల్లా, నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్‌బాషా, ఎస్‌బీ సీఐ గంగిరెడ్డి, ఆర్‌ఐలు పాల్గొన్నారు.



పలమనేరులో జరిగిన ఆసరా చెక్కుల పంపిణీ సభకు హాజరైన మహిళలు



వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందిస్తున్న ప్రజాప్రతినిధులు

బాబును ఇంటికి పంపుదాం

హెరిటేజ్‌లో లాభాల కోసం చిత్తూరు పాడి రైతులను నిలువునా మోసం చేసిన ఘనుడు.. డ్వాక్రా మహిళలను రుణమాఫీ పేరిట నిలువునా దగా చేసిన మాయదారి చంద్రబాబును మరోసారి ఇంటికి పంపాలని ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప పిలుపునిచ్చారు. మహిళలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని పలమనేరులో జరిగిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు ప్రసంగించారు.

- డ్వాక్రా మహిళలను నట్టేట ముంచింది చంద్రబాబే
- హెరిటేజ్ కోసం విజయాడెయిరీని మూసేసిన ఘనుడు కూడా ఆయనే
- ఫ్యాన్ గుర్తుపై గెలిచిన అమరనాథరెడ్డి పార్టీ ఫిరాయించి అక్కడ మంత్రి అయ్యాడు
- వైఎస్సార్ పేరు చెప్పకుండా షర్మిలమ్మ మాట్లాడుతుందా ?
- సీఎం జగనన్న పాలనలో ఎంత మేలు జరిగిందో మహిళలకే తెలుసు
- వైఎస్సార్ ఆసరా బహిరంగసభలో ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప

పలమనేరు: రాష్ట్రాన్ని, ప్రజలను భ్రష్టు పట్టించిన పాపాల చంద్రబాబును వచ్చే ఎన్నికల్లో జనం మరోసారి ఇంటికి పంపాలని రాజంపేట, చిత్తూరు ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప అన్నారు. పలమనేరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో వైఎస్సార్ నాలుగో విడత ఆసరా మెగా చెక్కు పంపిణీ కార్యక్రమ బహిరంగ సభ మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన, స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైకిల్ గుర్తుపై ఏనాడు మంత్రి కానీ అమరనాథరెడ్డి ఫ్యాన్ గుర్తుపై గెలిచి పార్టీ మారి మంత్రిపదవి దక్కించుకున్న విషయం జనం తెలుసుకోవాలన్నారు. మాజీ మంత్రేమో ఇక్కడి దళితులను గ్రామసింహాలుగా పోలిస్తే, వారి నాయకుడు చంద్రబాబు ఎవరైనా ఎస్సీలుగా పుట్టాలనుకుంటారా అని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. నాడు మిథున్‌రెడ్డి బిక్షతో వైఎస్సార్ సీపీలోకి వచ్చిన మాజీమంత్రి ఇవాళ పెద్దిరెడ్డిని విమర్శించడం సబబు కాదన్నారు. జిల్లాలోని షుగర్ ఫ్యాక్టరీని, విజయాడెయిరీని మూసేసిన పాపాల చంద్రబాబు ఇప్పుడు ఇంకొకరిని విమర్శించడం మానుకోవాలన్నారు. సరిగ్గా మాటలు రాని లోకేష్ ఓ వైపు, వైఎస్సార్ పేరు చెప్పకుండా మాట్లాడని షర్మిలమ్మ మరోవైపు విమర్శిస్తుంటే జనం నోరెళ్లబెడుతున్నారని దుయ్యబట్టారు. ఇదే పలమనేరులో గత టీడీపీ పాలనలో పదుల సంఖ్యలో ఇళ్లు ఇస్తే, సీఎం జగనన్న పాలనలో ఇక్కడ పదివేల ఇళ్లను ఇచ్చింది నిజం కాదా, ఆలోచించాలన్నారు. రాజకీయాలకు కొత్త అయిన వెంకటేగౌడ చేతిలో గత ఎన్నికల్లో ఘోరంగా ఓడిన మాజీమంత్రి ఈ ఎన్నికల్లో మళ్లీ చిత్తుకావడం తథ్యమని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. కుప్పానికి చంద్రబాబు నీళ్లు ఇవ్వకపోతే హంద్రీనీవా ద్వారా నీళ్లను ఇచ్చింది సీఎం జగనన్నే అని తెలిపారు.

రూ.7.71 కోట్ల మెగా చెక్కు పంపిణీ..

పలమనేరులోని 785 మహిళా గ్రూపులకు నాలుగో దఫా రూ.7.71 కోట్ల మెగా చెక్కును ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్‌పర్సన్ల చేతుల మీదుగా గ్రూపు సభ్యులకు అందజేశారు. నాలుగు విడతల్లో కలిపి రూ.30.85 కోట్లను డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం ద్వారా అందించినట్టు మెప్మా పీడీ రాధమ్మ తెలిపారు. ఈ సందర్భంగా డ్వాక్రా సభ్యులు ఏర్పాటు చేసిన పలు రకాల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పవిత్ర, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, మురళీకృష్ణ, రంగన్న, మండిసుధా, మున్సిపల్ వైస్ చైర్మన్లు గుల్జార్ రహీంఖాన్, రవి, ఎంపీపీలు మొగసాల రెడ్డెప్ప, యువరాజ్, లాయర్ రెడ్డెప్ప, కమిషనర్ రమణారెడ్డి, కన్వీనర్లు జాఫర్, బాలాజీనాయుడు, బాగారెడ్డి, మోహన్‌రెడ్డి, బాలగురునాథ్, మున్సిపల్ కౌన్సిలర్లు, మెప్మా సీఎంఎం ఉమేష్‌జాదవ్, సీఓలు, పట్టణ సమాఖ్య లీడర్లు, ఆర్‌పీలు, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీని నమ్మితే పుట్టగతులు ఉండవు..



టీడీపీ ఆవిర్భావం నుంచి టీడీపీ కోసం కష్టపడిన తననే మోసం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కింది. లేనిపోని సంక్షేమ పథకాలతో రాష్ట్రం ఆర్థిక పరిస్థితి దిగజారిందంటున్న చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో ఇంతకుమించి పథకాలను ఎలా ఇవ్వగలరు?. నాలాగా ఎవరైనా టీడీపీని నమ్ముకుంటే మాత్రం పుట్టగతులు ఉండవన్నారు.

– సుభాష్ చంద్రబోస్, సూపర్‌బజార్ అధ్యక్షుడు

ఒక్కసారి మీ బ్యాంకు బుక్ చూడండి..



నాటి చంద్రబాబు పాలనకు, నేటి జగనన్న పాలనకు తేడా చూడాలంటే 2014 నుంచి ఇప్పటిదాకా మహిళలు మీ బ్యాంకు పాస్‌బుక్‌లను చూడండి. గతంలో మీకు ఎంత డబ్బు అందింది ? ఈ ప్రభుత్వంలో ఎంత లబ్ధి చేకూరిందో తేడా చూడండి. బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారాన్ని తెచ్చి ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు మాట నిలుపుకున్నారా ? నాలాగా ఎన్నికలకు ముందు, గెలిచాక మీ ఇంటి గడప తొక్కినట్టు, గతంలో ఏ ఎమ్మెల్యే అయినా వచ్చారా?

– వెంకటేగౌడ, ఎమ్మెల్యే

సంక్షేమంలో ఏపీనే టాప్..



నేను ఐఏఎస్ పరీక్ష కోసం తర్ఫీదవుతున్న సమయంలో అన్ని పుస్తకాలను చదివానని, అందులో మహిళా సంక్షేమంలో ఏపీ అగ్రస్థానంలో ఉందనే విషయం తెలిసిందన్నారు. మన రాష్ట్రంలోని పలు సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు సైతం అమలు చేస్తున్నాయంటే ఇక్కడి పాలసీలు బాగున్నట్టే అన్నారు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా బాగుంటే ఆ కుటుంబం, సమాజం బాగుంటుందన్నారు.


– మనోజ్‌రెడ్డి, పలమనేరు ఆర్‌డీఓ

గొప్ప సంకల్పంతో కల్యాణ మండప నిర్మాణం

- చారిత్రక బుగ్గ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం
- ప్రజల ఆకాంక్ష మేరకు కల్యాణ మండపం నిర్మాణం
- వసంతి పంచమి రోజున ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టడం ఆనందంగా ఉంది: మంత్రి ఆర్‌కే రోజా, టీటీడీ చైర్మన్ భూమన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, మంత్రి ఆర్‌కే రోజా



టీటీడీ కల్యాణ మండపం ప్లాన్

నగరి : చారిత్రక నేపథ్యం కలిగి, ఎంతో ప్రసిద్ధి గాంచిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయం కొలువై ఉన్న బుగ్గ అగ్రహారం గ్రామంలో పెళ్లిళ్లు చేసుకునే అవకాశం స్థానిక ప్రజలకు కల్పించాలన్న సత్సంకల్పంతోనే టీటీడీ కల్యాణ మండపం నిర్మిస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. బుధవారం ఆలయ ఆవరణలో రూ.2 కోట్ల నిధులతో నిర్మించే టీటీడీ కల్యాణ మండపానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డితో కలిసి ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి రోజా మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుపొందిన పవిత్ర స్థలంలో ఒక కల్యాణ మండపం ఉంటే బాగుంటుందన్నది పరిసర ప్రాంత ప్రజల నాలుగు దశాబ్దాల కల అన్నారు. తాను ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు ఈ అంశాన్ని తన దృష్టికి తెచ్చేవారన్నారు. గత ప్రభుత్వాలు ప్రయత్నించినా అది సఫలీకృతం కాలేదన్నారు. కలియుగదైవం వేంకటేశ్వరుని కటాక్షంతో తన గురువు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ఆశీర్వాదంతో, మంచి మనసుతో వసంత పంచమిని రోజున కల్యాణ మండపానికి భూమిపూజ చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆమె మూడవ ఫ్లోర్ మంజూరు చేయాలని టీటీడీ చైర్మన్‌ను కోరారు.

బుగ్గ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం..

చారిత్రక బుగ్గ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి అన్నారు. టీటీడీ కల్యాణ మండపం భూమిపూజకు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నేడు మహత్తర కార్యక్రమానికి హాజరు కావడం ఆనందదాయకమన్నారు. అతి తక్కువ ఖర్చుతో స్థానిక ప్రజలు వివాహాలు జరిపించుకునే అవకాశం కల్పించాలన్న మంత్రి రోజా భగీరథ ప్రయత్నం నేటికి ఫలించిందన్నారు. ఆమె అడిగిన మరిన్ని అభివృద్ధి పనులకు కూడా ప్రతిపాదనలు రాగానే వందశాతం నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. పురాతనమైన ఆలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయించడంలో స్పష్టంగా ఉందని తప్పక అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి రోజాను, టీటీడీ చైర్మన్‌ను స్థానికులు గజమాలతో సత్కరించారు.కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్నమ్మ, ఈఈ మనోహర్, డిప్యూటీ ఈఈ భాస్కర్, సూపరింటెండెంట్ రమేష్, ఎంపీపీ భార్గవి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమల రెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల అధ్యక్షుడు సుదర్శన నాయుడు, సర్పంచ్ రవి, సచివాయ కన్వీనర్ హరి తదితరులు పాల్గొన్నారు.

నేడు సోలార్ ప్రాజెక్టు ప్రారంభం

- రూ.6 కోట్లతో నెలరోజుల్లోనే నిర్మాణం



సోలార్ ప్రాజెక్టు ప్రారంభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా, నాగభూషణం

పుంగనూరు: పట్టణ పరిధిలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోలార్ ప్రాజెక్టును రూ.6 కోట్లతో నిర్మించారు. గురువారం సోలార్ ప్రాజెక్టును మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభిస్తారని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. బుధవారం సోలార్ ప్రాజెక్టును కమిషనర్ నరసింహ ప్రసాద్, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణంతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.30 లక్షలు ప్రతి నెల విద్యుత్ చార్జీలకు చెల్లిస్తున్నామన్నారు. దీన్ని తగ్గించేందుకు సహజ సిద్ధమైన సోలార్ విద్యుత్‌ను వినియోగంలోనికి తీసుకొచ్చేందుకు రూ.6 కోట్లతో ప్రాజెక్టును నెలరోజుల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పట్టణంలోని శాంతినగర్‌లో సుమారు రూ.90 లక్షలతో విద్యుత్ ఎల్‌టీలైన్లను మార్చడం జరిగిందన్నారు. వీటిని కూడా మంత్రి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కౌన్సిలర్ నరసింహులు, బోయకొండ గంగమ్మ ఆలయ డైరెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో బోయకొండ వనం

- నేడు ప్రారంభించనున్న మంత్రి పెద్దిరెడ్డి



బోయకొండ వనం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు

చౌడేపల్లె: జిల్లాలో రెండో పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న శ్రీ బోయకొండ గంగాపురంలో రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన బోయకొండ వనాన్ని గురువారం ఉదయం 10 గంటలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఈఓ చంద్రమౌళితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. బోయకొండ గంగాపురంలో రూ.3 కోట్ల వ్యయంతో 11 హెక్టార్లలో ఎకో టూరిజం ద్వారా మొదటి దశలో గుర్తించిన పనులను శరవేగంగా పూర్తి చేసినట్లు చెప్పారు. బోయకొండ గంగమ్మ దర్శనార్థం వచ్చే యాత్రికులను ఆకట్టుకునేలా ముఖద్వారం, పార్కు, విశ్రాంతి భవనాలు, రోస్ గార్డెన్, పవిత్ర వనం, వాకింగ్ ట్రాక్ తదితర 17 రకాల అభివృద్ధి పనులు చేపట్టేలా మాస్టర్‌ప్లాన్ రూపొందించినట్లు డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

భావి శాస్త్రవేత్తలకు వేదిక ఇన్‌స్పైర్ మనక్

- విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయండి
- యూట్యూబ్‌లో చూసి ప్రయోగాలు వద్దు
- సృజనాత్మకత ఆధారంగా ప్రయోగాలు చేయించండి
- జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో కలెక్టర్ షణ్మోహన్



ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్



ప్రాజెక్టుల తయారీపై విద్యార్థులను ప్రశ్నిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్:విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రానికి సమీపంలో ఉన్న పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ షణ్మోహన్ అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్ర పరంగా వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడం చాలా అవసరమన్నారు. విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, వాటి సాఫల్యతకు ఊతమిచ్చేందుకు ఏటా ఇన్‌స్పైర్ మనక్ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు జిల్లాస్థాయిలో జరిగే ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారిని పరిశోధనలవైపు ఆకర్షితులను చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రం, ఆ తరువాత జాతీయ, అంతర్జాతీయస్థాయి కార్యక్రమాలకు తీసుకెళ్తామని తెలిపారు.

సృజనాత్మకతను వెలికితీయండి..

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సైన్సు ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టులను కలెక్టర్ షణ్మోహన్ పరిశీలించారు. ప్రతి విద్యార్థి వద్దకు వెళ్లి వారు తయారు చేసిన ప్రాజెక్టు వివరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో కొంతమంది విద్యార్థులు కలెక్టర్ అడిగిన చిన్నపాటి ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయారు. మరికొంతమంది చేసిన ప్రాజెక్టులను చూసి సంబంధిత విద్యార్థులను అభినందించారు. యూట్యూబ్‌లో చూసి ప్రాజెక్టు తయారు చేశామని ఒక విద్యార్థి సమాధానమివ్వగా, వెంటనే కలెక్టర్ ఆ విద్యార్థిని గైడ్ చేస్తున్న ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత ఆధారంగా ప్రాజెక్టులు తయారు చేయాలని చెబితే, ఆన్‌లైన్‌లో దొరికే ప్రాజెక్టులను పెడతారా అంటూ విద్యాశాఖ అధికారుల తీరుపై మండిపడ్డారు. కార్యక్రమంలో డీఈఓ దేవరాజు, సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఏడీ విజయేంద్రరావు, డీవైఈఓ చంద్రశేఖర్, జిల్లా సైన్స్ ఆఫీసర్ వెంకటరమణ, విద్యార్థులు, గైడ్‌టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం


విద్యార్థి చరణ్ (ఫైల్)

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న, అదే గ్రామానికి చెందిన చరణ్ వారం రోజులుగా కనపడడం లేదని తల్లిదండ్రులు సుబ్రమణ్యం, సుజాత పెద్దపంజాణి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 8వ తేదీ పాఠశాల నుంచి ఇంటికి వచ్చి అదృశ్యమయ్యాడని బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించామన్నారు. తమ కుమారుడి ఆచూకీ తెలిసిన వారు 9542347990 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వార్డెన్ సస్పెన్షన్


విద్యార్థులను విచారిస్తున్న రాజ్యలక్ష్మి

పూతలపట్టు: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వసతి గృహ సంక్షేమ అధికారి పి.సురేష్‌ను బుధవారం కలెక్టర్ షణ్మోహన్ సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం పి.కొత్తకోట ఎస్సీ ప్రభుత్వ బాలుర వసతి గృహ అధికారిపై ఫిర్యాదులు జిల్లా కలెక్టర్‌కు అందడంతో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మి రాత్రి వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులను ఆమె విచారించగా మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, వసతి గృహ అధికారి, వాచ్‌మెన్ కూడా సరిగా విధులకు హాజరు కావడం లేదని, మరుగుదొడ్లు సరిగా లేవని విద్యార్థులు తెలిపారు. వీటిని పరిగణనలోకి తీసుకుని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ బుధవారం వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. ప్రస్తుతం చిత్తూరు వసతి గృహ అధికారి శ్రీకాంత్‌కు పి.కొత్తకోట వసతి గృహ ఇన్‌చార్జ్ ఇచ్చినట్లు తెలిసింది.

'అన్యాయంగా నా బిడ్డను చంపేశారు'

మదనపల్లె : వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని తన బిడ్డను అన్యాయంగా చంపేశారని చిన్నారి హరన్ సాకేత్ తండ్రి నాగరాజు ఆరోపించాడు. బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో బాలుడు హరన్ సాకేత్ (3) మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మంగళవారం మండలంలోని చిప్పిలి గ్రామంలో నీటితొట్టిలో పడి చిన్నారి హరన్ సాకేత్ మృతి చెందిన విషయం తెలిసిందే. బిడ్డను కడసారి చూసుకునేందుకు స్వగ్రామం చిత్తూరు జిల్లా కల్లూరు నుంచి బాలుడి తండ్రి నాగరాజు స్థానిక జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. విగతజీవిగా ఉన్న బిడ్డను చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన భార్య మయూరి, ఆమె సహజీవనం చేస్తున్న శివశంకర్ రెడ్డి తన బిడ్డను చంపేశారని ఆరోపించాడు. 14 నెలల క్రితం తన భార్య వెళ్లిపోయిందని, తన పిల్లలను సైతం చూపించలేదని తెలిపాడు. తన వద్ద ఉంటే బిడ్డ బతికేవాడని వాపోయాడు. శివశంకర్‌రెడ్డికి తాను కొంత నగదు అప్పుగా ఇచ్చానని, ఈ క్రమంలో తన భార్యను వశపరుచుకుని మదనపల్లె మండలం చిప్పిలి గ్రామంలో ఇద్దరు సహజీవనం చేస్తున్నారని, ఈ విషయం ఇప్పటిదాకా తనకు తెలియదన్నారు. పెద్ద కుమారుడు వరుణ్ సాకేత్(5)ను తన భార్య ఆమె తల్లిదండ్రుల వద్ద వదిలి పెట్టి చిన్నకుమారుడు హరన్ సాకేత్‌ను తన వద్దే ఉంచుకుందన్నారు. అయితే వారి వివాహేతర సంబంధానికి పిల్లాడు అడ్డు ఉన్నాడన్న నెపంతో చంపేసి నీటి తొట్టిలో పడి మృతి చెందాడని వారు చెబుతున్నారని ఆరోపించాడు. తన బిడ్డ ముఖంపై గాయాలు సైతం ఉన్నాయని, దీనిపై మయూరి, శివశంకర్‌రెడ్డిని విచారించి తనకు న్యాయం చేయాల్సిందిగా కోరారు.

వేడుకగా సామూహిక అక్షరాభ్యాసం


పిల్లలచే అక్షరాలు దిద్దిస్తున్న ఆలయ చైర్మన్ దంపతులు, ఈఓ, వేదపండితులు

- కాణిపాకంలో ఘనంగా వసంత పంచమి వేడుకలు
- పెద్దఎత్తున పిల్లలతో హాజరైన తల్లిదండ్రులు


అక్షరాభ్యాసం కార్యక్రమానికి చంటి పిల్లలతో హాజరైన తల్లిదండ్రులు

కాణిపాకం(యాదమరి): వసంత పంచమి, చదువుల తల్లి సరస్వతి దేవి పుట్టిన రోజు సందర్భంగా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం పరిసరాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తమ పిల్లలతో విచ్చేశారు. ఉదయం స్వామివారి అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి, సరస్వతి దేవి దేవతామూర్తులకు వేదపండితులు ప్రత్యేక అభిషేక, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు అధికారులు మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా స్వామివారిని ఆస్థాన మండపంలో కొలువుదీర్చారు. అనంతరం సరస్వతి దేవి చిత్రపటం, కలశాలను ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి దంపతులు, ఈఓ వెంకటేశు జ్యోతి ప్రజ్వలన చేసి హోమాలు ప్రారంభించారు. వేదపండితులు మంత్రాలు పఠిస్తూ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం ప్రారంభించారు. పిల్లలకు అక్షరాభ్యాసం చేయించే తల్లిదండ్రుల గోత్ర నామాలతో పూజలు చేసి వారు తెచ్చుకున్న పలకలపై ఓం నమఃశ్శివాయ.. అంటూ మూడుసార్లు రాయించి పిల్లలచే దిద్దించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ..

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. వసంత పంచమి సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచి రూ.150, రూ.100, ఉచిత క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు చర్యలు తీసుకున్నారు.


భక్తులతో నిండిపోయిన క్యూలు

ప్రతిపక్షాలకు అభివృద్ధి కనిపించదు


ఇల్లత్తూరులో ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి ఆర్‌కే రోజా, ప్రజాప్రతినిధులు, అధికారులు

- ఇల్లత్తూరులో సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ల ప్రారంభం
- అభివృద్ధిని చూసి ఓర్వలేకనే పచ్చనేతలు, పచ్చమీడియా ఆరోపణలు
- మంత్రి ఆర్‌కే రోజా

విజయపురం (నగరి): ఆంధ్రాలో అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు వెళ్తుంటే పచ్చనేతలు, పచ్చ మీడియాకు మాత్రం పచ్చకామెర్లు వచ్చాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. బుధవారం విజయపురం మండలంలోని ఇల్లత్తూరు పంచాయతీలో ఒకే ప్రాంగణంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.8 లక్షల వ్యయంతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రోజాకు స్థానిక మహిళలు కర్పూర హారతులు ఇచ్చి, గజమాలతో సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం అభివృద్ధిని కాగితాలకే పరిమితం చేసిందన్నారు. నేడు ఇంత అభివృద్ధి జరుగుతున్నా ప్రతిపక్షాలు అభివృద్ధి జరగలేదనడం చూస్తుంటే వారికి భయంకరమైన కొత్త రోగం వచ్చినట్లుందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడకు వెళ్లి అడిగినా అభివృద్ధిని ప్రజలే తీసుకెళ్లి చూపిస్తారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సీఎం జగనన్న ప్రజల చెంతకే ప్రభుత్వ పాలనను తీసుకొచ్చారని తెలిపారు. ఇంత మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు మరోమారు అండగా నిలవాలని కోరారు. అలాగే ఇల్లత్తూరులో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆర్‌కె రోజా, ఆమె భర్త సెల్వమణి ప్రారంభించారు. అనంతరం రూ.24 లక్షల వ్యయంతో నిర్మించిన ట్యాంక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్టీ విజయమే లక్ష్యంగా దిశానిర్దేశం

- సత్యవేడులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించండి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం/నారాయణవనం: సత్యవేడు నియోజకవర్గంలో సమష్టిగా పనిచేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌ను నేతలు, కార్యకర్తలకు పరిచయం చేశారు. సమావేశానికి నారాయణవనం, పిచ్చాటూరు, కేవీబీపురం, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు చెందిన పార్టీ నాయకులతో వేర్వేరుగా సమావేశమయ్యారు.

అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. అభ్యర్థి ఎవరైనా మనకి జగనన్నే ముఖ్యమని, ఆ దశగా పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. 2019లో వచ్చిన 43వేల మెజారిటీ కంటే ఎక్కువ ఆధిక్యత రావాలని సూచించారు. రాబోయే ఎన్నికలు ఎంతో కీలకమని, ప్రతి కార్యకర్త, నాయకుడు తామే అభ్యర్థులుగా భావించి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు బీరేంద్ర వర్మ, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, జిల్లా మహిళా అధ్యక్షురాలు బొర్రా మాధవి, సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ వేలూరు రాకేష్, ముదిరాజ్ సంఘం డైరెక్టర్ తరిణి ధనంజయరెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు నాయుడు దయాకర్‌రెడ్డి, సుశీల్ కుమార్ రెడ్డి, అపరంజిరాజు, సొరకాయలు, ఆరణి విద్యానాథరెడ్డి , గవర్ల కష్టయ్య , వెంకటచలపతిరాజు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శివశంకర్, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, కైలాసకోన ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యంయాదవ్, కో-ఆప్షన్ సభ్యుడు మణి రెడ్డి పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన సత్యవేడు నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు

సేవకుడిగా పనిచేస్తా..

వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గం సమన్వయకర్త నూకతోటి రాజేష్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో సేవకుడిలా పనిచేస్తానని తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని వెల్లడించారు.

టెండర్లతో ఆదాయం రూ.84 లక్షలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి టెండర్ల ద్వారా రూ.84 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఏడాది పాటు వీటిని నిర్వహించేందుకు బుధవారం ఈఓ కార్యాలయం వద్ద నిర్వహించిన టెండర్ల వివరాలు సెల్‌ఫోన్లు, కెమెరాలు భద్రపరచడానికి రూ.47 లక్షలు, శివాలయం పార్కులో, పరిసరాలలో ఫొటోలు తీసుకునేందుకు రూ.18.05 లక్షలు, డార్మెటరీ హాల్‌లో బంకు నిర్వహించేందుకు రూ.4.10 లక్షలు, పాలాభిషేకానికి పాలు విక్రయించేందుకు రూ.6.15 లక్షలు, బస్టాండ్ వద్ద బంకు నిర్వహించేందుకు రూ.9.15 లక్షలు, మొత్తం రూ.84.45 లక్షలు ఆలయానికి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు, హరిమాధవ రెడ్డి, ఏసీ ఆఫీస్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, టెండర్‌దారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


ఘటనా స్థలంలోనే మృతి చెందిన ఖాదర్‌బాషా


ఐరాల: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పాటూరు సంతగేటు వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. పాటూరు సంతగేటుకు చెందిన ఖాదర్‌బాషా(70) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఉదయం పాటూరు సంతగేటు వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఖాదర్‌బాషా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

భారీగా కర్ణాటక మద్యం సీజ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: భారీగా కర్ణాటక మద్యం తీసుకెళ్తున్న ఓ జంటను పోలీసులు పట్టుకున్నారు. చిత్తూరు తాలూక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం డీఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డి, సీఐ కుళ్లాయప్పతో కలిసి వివరాలను మీడియాకు వెల్లడించారు. చిత్తూరు మండలంలోని నగిరిపల్లె-కన్నికాపురం గ్రామ సమీపం రైల్వే బ్రిడ్జి వద్ద ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, తన సిబ్బందితో కలిసి బుధవారం ఉదయం తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో అటుగా వచ్చిన ఓ కారును తనిఖీ చేయగా, గంగాధరనెల్లూరు మండలం కాలేపల్లెకు చెందిన తోటి ముద్దుకృష్ణ (29), అదే మండలం ఒగ్గువారిపల్లెకు చెందిన కర్పూరం జానకి (35) కర్ణాటక మద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని, కారులోని 28 బాక్సుల్లో ఉన్న కర్ణాటక టెట్రా ప్యాకెట్లను సీజ్ చేశారు. నిందితులను విచారించగా కర్ణాటక నుంచి పెద్దఎత్తున మద్యం తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. గతంలో కూడా రెండుమార్లు తీసుకొచ్చి పోలీసుల కంటపడకుండా మద్యాన్ని విక్రయిస్తే, ఒక్కో ట్రిప్పునకు రూ.40 వేల వరకు లాభాలు వచ్చినట్లు ఒప్పుకున్నారు. మూడోసారి నిందితులు పోలీసులకు చిక్కారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపించిన ఎస్ఐ, సిబ్బందికి డీఎస్పీ నగదు రివార్డులు అందజేశారు.

కాటిపేరి సచివాలయంలో దొంగల బీభత్సం


కాటిపేరి సచివాలయంలో ధ్వంసమైన ఫర్నీచర్

చౌడేపల్లె: మండలంలోని కాటిపేరి సచివాలయ రికార్డులు, ఫర్నీచర్లను దొంగలు ధ్వంసం చేసిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సచివాలయం పక్కనే ఉన్న ఓ చెట్టు ద్వారా భవనం మిద్దెపైకి ఎక్కి కార్యాలయంలోని గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించారని గుర్తించారు. కార్యాలయం లోపల ఉన్న విలువైన రికార్డులను చించి పడేయ డంతో పాటు ఫర్నీచర్లను ధ్వంసం చేశారు. గదిలో నిల్వ ఉన్న పశు సంవర్ధక శాఖకు చెందిన వైద్యసామగ్రి, మందుల బాటిళ్లను ధ్వంసం చేశారని పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ స్థానిక ఎంపీడీఓ వెంకటేశుకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. సచివాలయంలో చొరబడిన అనుమానితుల వ్యక్తుల వివరాల సేకరణలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రహదారి భద్రత.. అందరి బాధ్యత

- సీనియర్ సివిల్‌జడ్జి కరుణ కుమార్


ఎల్ఎల్ఆర్ పత్రాన్ని అందజేస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి కరుణ కుమార్, డీటీసీ నిరంజన్‌రెడ్డి

చిత్తూరు రూరల్: డ్రైవింగ్ చేసే ప్రతి వ్యక్తి తన కుటుంబ సభ్యులను గుర్తు పెట్టుకుని డ్రైవింగ్ చేయాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఐ.కరుణ కుమార్ అన్నారు. చిత్తూరు నగరంలోని ఉప రవాణా శాఖ కార్యాలయంలో బుధవారం 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా యువతకు, వివిధ డ్రైవింగ్ స్కూల్స్ యాజమాన్యం వారికి మోటారు వాహన చట్టం, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపరాదని, డ్రైవింగ్ చేసేటప్పుడు రోడ్డు నియమ నిబంధలను పాటించడంతో పాటు వాహనాలకు ఇన్సూరెన్స్, పొల్యూషన్, రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించాలని సూచించారు. డీటీసీ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు 2024 జనవరి 20 నుంచి ఫిబ్రవరి 19 వరకు జిల్లాలో 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా యువశక్తి ద్వారా సామాజిక మార్పు తీసుకురావడం ముఖ్య ఉద్దేశమన్నారు. ఆర్టీఓ సునీల్ కుమార్ మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి వ్యక్తికి తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలన్నారు. అనంతరం ఎల్ఎల్ఆర్ పొందిన వారికి ఎల్ఎల్ఆర్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.